సొంతింటివారమండీ..

- పేదల ఇళ్ల పట్టాలకు జోరుగా రిజిస్ట్రేషన్లు
- లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ నిర్ణయం
- ప్రభుత్వ చర్యలతో ఆనందం



జార్జిపేట సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు



పటవలలో పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు

తాళ్లరేవు: భూమి ఇస్తే చాలదు.. సర్వ హక్కులూ కల్పించి పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభిమతం. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి సొంతింటి వారిని చేయడమే కాకుండా ఆ ఇంటిపై అన్ని అధికారాలూ ఉండేలా చూస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఆ ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. ఇంటికి ఇల్లాలే వెలుగు అనే నానుడిని నిజం చేసేలా ఇప్పటికే అతివల పేరు మీద ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముమ్మరంగా చేపట్టింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు ఉచితంగా అందించిన స్థలాలకు ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసే బాధ్యతను భుజస్కంధాలపై వేసుకుంది. దీనిపై సర్వత్రా ఆనందం వ్యక్తం అవుతోంది. తాళ్లరేవు మండలం చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, పటవల, కోరంగి, సీతారామపురం, చిన్నవలసల, పెదవలసల, లక్ష్మీపతిపురం, గాడిమొగ, రాంజీనగర్, నీలపల్లి గ్రామ పంచాయతీల్లో 26 లేఅవుట్‌లు వేశారు. ఆయా చోట్ల మొత్తం 5,455 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇందులో ఇప్పటివరకూ 3 వేల మంది ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు తెలిపారు. గత ప్రభుత్వాలు ఏదో ఇచ్చామన్న పేరుకు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకొనేవి. ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరిగేవికావు. డీ పట్టాలు ఇవ్వడంతో వాటిపై పేదలకు ఎలాంటి హక్కులూ ఉండేవి కావు. అత్యవసర సమయాల్లో పేదలకు ఎలాంటి ఉపయోగం ఉండేది కాదు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఏదో స్థలం ఇచ్చామని వదిలేయకుండా వారికి ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటు, ఆ ఇంటిపై రిజిస్ట్రేషన్ రూపంలో సర్వ హక్కులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పిస్తుంది. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రూ.లక్షల విలువైన స్థలాలు

ఇప్పటివరకూ సెంటు భూమి కూడా లేని నిరుపేదలకు ప్రభుత్వం రూ.లక్షల విలువైన భూమిని పంపిణీ చేసింది. మండలంలో భూముల ధరలు బాగా పెరగడంతో సెంటు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా పలుకుతోంది. దీంతో ఒక్కొక్క లబ్ధిదారునికి సెంటున్నర చొప్పున పంపిణీ చేయడంతో వారి స్థలం ఖరీదు రూ.5 లక్షల పైమాటే ఉంటోంది. జిల్లా కేంద్రం అమలాపురానికి దగ్గరలోని భూములకు సంబంధించి సెంటు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ పలుకుతోంది. వారికి సుమారు రూ.10 లక్షలకు పైనే లబ్ధి చేకూరుతోంది.

పేదలకు పండగ

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. సచివాలయ కార్యదర్శి సబ్ రిజిస్ట్రార్ హోదాలో వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు లబ్ధిదారుల ఈకేవైసీ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. తద్వారా పేదల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంది. రూ.లక్షల విలువైన ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఆ స్థలంపై తమకు సర్వహక్కులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని మహిళలు చెబుతున్నారు.

జగనన్న మేలు మరువలేం



ఎంతోకాలంగా ఇంటి స్థలం కోసం ఎదురుచూశాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీరే ఇంటికి వచ్చి మాకు ఇల్లు లేదని గుర్తించి దరఖాస్తు చేయించడంతో పాటు ఇంటి పట్టాను అందజేసింది. అంతటితో ఆగకుండా ఆ పట్టాకు ఉచితంగా రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇచ్చారు. సీఎం జగనన్న మా ఇంటిపై శాశ్వత హక్కు కల్పించడం చాలా సంతోషంగా ఉంది. ఆయన మేలు ఎప్పటికీ మరువలేం.

– రెడ్డి అనురాధ, తాళ్లరేవు

క్లుప్తంగా

సమన్వయంతో విధులు



డీఆర్వో సత్తిబాబు, ఏఓ కాశీ విశ్వేశ్వరరావులను సత్కరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: చక్కని ప్రణాళిక, సమన్వయంతో విధులు నిర్వర్తించే అధికారులకు గుర్తింపు ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో బదిలీపై వెళ్లిన డీఆర్వో సత్తిబాబు, ఏఓ కాశీ విశ్వేశ్వరరావులకు గురువారం రాత్రి వీడ్కోలు సభ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలో వీరు కీలక భూమిక పోషించి పరిపాలనలో పూర్తి సహకారం అందించారన్నారు. వీరి సహకారంతో జిల్లా యంత్రాంగాన్ని సమన్వయ పరిచి అన్ని రంగాల్లో పురోగతి సాధించామన్నారు. డీఆర్ఓ సత్తిబాబు, ఏఓ కాశీవిశ్వేశ్వరరావులను ఆదర్శంగా తీసుకుని మిగతా సిబ్బంది పనిచేయాలని జేసీ ఎస్.నూపుర్‌అజయ్ అన్నారు. అనంతరం వారిని సత్కరించారు. డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్ పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ



పైపులైన్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ అనురాధ

అల్లవరం: మొగళ్లమూరు పంచాయతీ పరిధి బీరవారి పేటలో ఎంపీ నిధులు రూ. 17.50 లక్షలతో పైపులైన్ ఏర్పాటుకు ఎంపీ చింతా అనురాధ శుక్రవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ రాయుడు విష్ణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ తన సొంత గ్రామం మొగళ్లమూరులో రూ. 2 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. అన్ని వీధుల్లో పక్కా రోడ్లు, పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించామని అన్నారు. అనంతరం గ్రామస్తులు ఎంపీని శాలువాలతో సత్కరించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ సభ్యుడు మాకే కృష్ణమూర్తి, కాశి చిరంజీవి, కోరుకొండ చిట్టిబాబు, కార్యదర్శి కనకమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

యానాం: యానాం సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. కాకినాడ నయన, ఐ కేర్‌కు చెందిన 8 మంది వైద్యుల బృందం వైద్య సేవలు అందించింది. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పర్యవేక్షణలో కేఎన్‌జీ ప్రభుత్వ బాలికల హైస్కూల్ హెచ్ఎం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 480 మందికి పరీక్షలు చేయగా 35 మందికి కళ్లజోళ్లు, పది మందిని కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

బాలికలకు బహుమతులు



ప్రతిభ కనబరిచిన బాలికలకు బహుమతులు అందజేస్తున్న సత్యనారాయణ

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకూ ఉన్న 13 సెక్షన్‌లలో తొలి మూడు ర్యాంకులు సాధించిన 39 మంది బాలికలకు రిటైర్డ్ హెచ్ఎం పితాని వీరవెంకట సత్యనారాయణ బహుమతులు అందజేశారు. తన తల్లిదండ్రులు స్వర్గీయ సుబ్బారావు, నాగరత్నం జ్ఞాపకార్థం 1984 నుంచి ఏటా డిక్షనరీలు, జీకే తదితర పుస్తకాలను అందజేస్తున్నట్లు సత్యనారాయణ తెలిపారు. ఆయన్ని స్కూల్ హెచ్ఎం సీహెచ్ పరిమళ, సిబ్బంది అభినందించారు.

మద్యం రవాణా అరికట్టాలి

యానాం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని యానాం పరిపాలనాధికారి మునిస్వామికి కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. యానాంలో మద్యంతో పాటు పెట్రోల్ అక్రమంగా తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. దీనిపై యానాం సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామని మునిస్వామి వివరించారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, విద్యార్థుల ఉన్నత భవితకు బాటలు వేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా బండారులంక జెడ్పీ హైస్కూల్లో శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన సరస్వతీదేవి పూజకు ఎంపీ చింతా అనురాధతో కలసి మంత్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక మేనమామలా ఉంటూ వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ఇంగ్లిష్ మీడియం విద్యను విద్యార్థులకు చేరువ చేశారన్నారు. మరో నాలుగు, ఐదేళ్లలో వాటి ఫలితాలు పుష్కలంగా వస్తాయన్నారు. తద్వారా ఈ ప్రాంతం నుంచి సివిల్ సర్వీసెస్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దిందుకు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బండారులంక హైస్కూల్ ప్రగతి దిశగా పరుగులు తీసిందన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి జాన గణేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పెదపూడి బాబూరావు, శ్రీనివాసా బాలమిత్ర సంఘం ప్రతినిధులు అంకం పెదరాజు, కడలి రాజు తదితరులు పాల్గొన్నారు.



బండారులంకలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులను ఆశీర్వదిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



నడిపూడి కుమ్మరి కాలువ వద్ద వంతెన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

- మంత్రి పినిపే విశ్వరూప్
- రూ. కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, అందుకే ప్రజల మన్ననలు అందుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం నడిపూడి కుమ్మరి కాలువ సమీపంలోని నల్ల వంతెన వద్ద ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా రూ.1.45 కోట్లతో నిర్మించిన హై లెవెల్ వంతెనను మంత్రి విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ ప్రారంభించారు. గ్రామ సడక్ యోజన నిధులు రూ.4.30 కోట్లు, ఎంపీ లాడ్స్ నిధులు మరో రూ.30 లక్షలతో పాలగుమ్మి మీదుగా ముక్కామల వరకూ నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం పాలగుమ్మి ఫుట్‌పాత్ బ్రిడ్జి నుంచి కంభంపాడు వరకూ ఎస్‌డీఎంఎఫ్ నిధులు రూ.2.40 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇందుపల్లి నుంచి పేరూరు వరకూ ఎస్‌డీఎంఎఫ్ నిధులు రూ.1.60 కోట్లతో బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దంగేటి డోలామణి, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రాంగోపాల్, సర్పంచులు చొల్లంగి శివాజీ, అప్పాజీ, కుడుపూడి రామలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, పంచాయతీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

ముమ్మిడివరం: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ముమ్మిడివరం అంబేడ్కర్ లేఅవుట్‌లో 173 మంది లబ్ధిదారులకు తితిదే పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రంలో 34 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కుల, మత, పార్టీల బేధం లేకుండా అర్హులందరికీ లబ్ధి చేకూర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో కమిషనర్ వెంకట రామిరెడ్డి, పెన్మెత్స చిట్టిరాజు, ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడుపూడి శంకర్‌రావు, వైస్ చైర్మన్ వి.బోసురాజు, పెయ్యల చిట్టిబాబు, కాశి బాలమునికుమారి, జగతా పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఘనంగా రథసప్తమి పూజలు



పాత బండారులంకలో స్వామివారికి పూజలు చేస్తున్న శంకరమూర్తి తదితరులు



కొమరగిరిపట్నంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అమలాపురం రూరల్: పాత బండారులంక గ్రామంలో భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను పురోహితుడు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ నిర్వహించారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆరోగ్య కారుడైన సూర్యనారాయణ స్వామివారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా రథోత్సవం

అల్లవరం: రథసప్తమిని పురస్కరించుకుని కొమరగిరిపట్నంలో కొలువైన శ్రీబాల త్రిపుర సుందరి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద రథోత్సవం జరిగింది. తొలుత మెట్ల వంశీయులు స్వామివారి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలతో స్వామివారి రథాన్ని కొమరగిరిపట్నం, బెండమూర్లంక గ్రామాల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మెట్ల రమణబాబు, వాసంశెట్టి సత్యం, చిక్కాల గణేష్, కడలి రామకృష్ణశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యనమస్కారాలతో ఆరోగ్యం

తాళ్లరేవు: రథసప్తమి పర్వదినం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సేవాభారత్ ఆంధ్రప్రదేశ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. యానాం ఖండ ప్రముఖ్ పీవీ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో మండలంలోని 15 పాఠశాలల నుంచి సుమారు 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ట్రోఫీలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. నిత్యం సూర్యనమస్కారాలు చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఓంప్రకాష్, పితాని శ్రీకృష్ణ, విత్తనాల కరిమలస్వామి, పితాని బాలవెంకటరమణ, కొల్లు యువరుద్ర, తారారామ్ పటేల్, వాతాడి శ్రీను పాల్గొన్నారు.

ముమ్మిడివరం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్, అకాడమీలో సూర్యనమస్కారాలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కోచ్ వాసంశెట్టి నరేష్, ప్రవీణ్, రాంబాబు, జాఫర్, మణికంఠ, బాబి, త్రినాథ్ పాల్గొన్నారు.



తాళ్లరేవులో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

సిద్ధ గురుమండలితో మానవజాతి భవిష్యత్తు



అంతర్జాతీయ యోగా నిపుణుడు శ్రీయష్

అమలాపురం రూరల్: మానవ జాతి ఉజ్వల భవిత కోసం హిమాలయాల్లో సూక్ష్మ శరీర ధారులైన సిద్ధ గురుమండలి పని చేస్తోందని హిమాలయ యోగి, వైదిక జ్యోతిష పండితుడు, అంతర్జాతీయ యోగా నిపుణుడు శ్రీయష్ అన్నారు. అమలాపురంలోని ఆదిశేష నిలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మృత్యురహిత జీవనం భవిష్యత్తులో సాకారం అవుతుందని తెలిపారు. త్వరలో ఆసక్తికరమైన, ఆశ్చర్యకరమైన వైద్య విధానంగా యోగా పరిణమిస్తోందని యష్ వివరించారు. హిమాలయాల్లో సిద్ధుల బృహత్కార్యంలో పనిచేసేందుకు తనను ఎంచుకోవటం ఎన్నో జన్మల సుకృతమన్నారు. రోగరహిత, వృద్ధాప్య రహిత, రోగులకు ప్రత్యామ్నాయ చికిత్స ధ్యానం అని, హీలింగ్ ప్రక్రియల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుతున్నారని దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధి విశ్వనాథరాజు తెలిపారు. అక్షయపాత్ర ప్రతినిధులు పోతురాజు రామకృష్ణ, నూకల ప్రసాద్, చాగంటి ప్రసాద్, లింగోలు విస్సు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది క్షేత్రంలో ఏర్పాట్ల పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని తీర్థమహోత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 19న నిర్వహించే కల్యాణానికి సంబంధించి వేదిక వద్ద ఏర్పాట్లను శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలన చేశారు. వేదిక వద్ద వీఐపీ గ్యాలరీలు, ఇతర గ్యాలరీల ఏర్పాట్ల గురించి అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. అలాగే సాధారణ భక్తులకు కల్యాణం వీక్షించేందుకు అవసరమయ్యే స్క్రీన్‌ల ఏర్పాటు గురించి కూడా ఎమ్మెల్యే, ఏసీ సత్యనారాయణకు సూచనలు చేశారు. అలాగే కల్యాణం భక్తులు అందరూ వీక్షించేలా చూడాలని ఏసీ సత్యనారాయణకు, ఎమ్మెల్యే తెలిపారు. వెంట చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజా బహద్దూర్, నాయకులు కేఎస్ఎన్ రాజు, ముప్పర్తి త్రిమూర్తులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళల ప్రగతి

యానాం: ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి చాటుతున్నారని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ అన్నారు. శుక్రవారం యానాం భీమ్ నగర్‌లోని జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం పేరాబత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజశేఖర్‌వర్మ, సంయుక్త, దుర్గాకుమారి, రవణమ్మ, అరుణ, కుసుమలత పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును అందజేస్తున్న విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్

యానాం: స్థానిక బాలయోగి క్రీడాప్రాంగణ పరిధి స్విమ్మింగ్‌పూల్‌లో గత నెల 30న ప్రమాదవశాత్తు పడి విద్యార్థి సూరిమిల్లి సాయిరోహిత్ (7) మృతిచెందాడు. ఆ కుటుంబానికి ఉపాధ్యాయ సంఘం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.1.68 లక్షల నగదును విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ చేతుల మీదుగా అందజేశారు. సేకరించిన సొమ్మును స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో ఐదేళ్ల కాలానికి తల్లి శ్యామల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన బాండ్‌ను స్థానిక కృష్ణదేవరాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులు శ్యామల, రాజులకు అందజేశారు. హెచ్ఎం బేతాళం బాబ్జి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిరుధాన్యాలతో స్నాక్స్

యానాం: నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు చిరుధాన్యాలతో తయారు చేసిన స్నాక్స్ పథకాన్ని వారానికి రెండుసార్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్, మిడ్డేమీల్స్ టి.కొంజు మోజీకుమారన్ ఆదేశాలు జారీ చేశారని విద్యాశాఖాధికారి లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. వారంలో సోమవారం, గురువారాలు ప్రాథమిక తరగతుల నుంచి ఇంటర్ చదివే ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు మిల్లెట్ స్నాక్స్‌ను అందించాలని పేర్కొన్నారు.


రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యులు మౌనిక, గీతిక తదితరులు

అల్లవరం: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు పిలుపునిచ్చారు. అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ మౌనిక ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ గీతిక పర్యవేక్షణలో 19 మంది యువకులు రక్తదానం చేశారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ సీహెచ్‌సీలో రక్తాన్ని స్టోర్ చేసే యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక యూనిట్‌లో సేకరించిన రక్తాన్ని భద్రపరిచి అత్యవసర సమయాల్లో రోగులకు వినియోగిస్తామన్నారు. తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై నిరసన



తాళ్లరేవులో ర్యాలీ చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

తాళ్లరేవు: రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం చెరువుగట్టు సెంటర్, సంతపేట సెంటర్ మీదుగా గుడ్డివానితూము వరకూ ట్రాక్టర్ల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్, చల్లా సంతోష్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, ఎస్.త్రిమూర్తులు, విప్పర్తి శ్రీనివాసరావు, పి.గోపాలకృష్ణ, మందనక్క తణుకురాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మునిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

ఉప్పలగుప్తం: వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ టి.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని చినగాడవిల్లి, మునిపల్లి గ్రామాల్లో పర్యటించి పోలింగ్ బూత్‌లను శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాల కల్పనపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఎస్.పల్లంరాజు, మమత తదితరులు పాల్గొన్నారు.